క్లుప్తంగా

వేడుకగా సప్రమహోత్సవం



ప్రత్యేకాలంకరణలో బాలయేసు

నెల్లూరు(బృందావనం) : సంతపేటలోని ఆర్సీఎం చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి బాల యేసు సప్రమహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. భక్తి గీతాలాపనలు, క్రిస్మస్ సందేశాలు, విద్యుద్దీపాలంకరణ, బాణసంచా వెలుగుల్లో బాల యేసు నగరోత్సవం సంతపేట, చేపల మార్కెట్, రైల్వేఫీడర్స్ రోడ్డు, కపాడిపాళెం తదితర ప్రాంతాల మీదుగా వేడుకగా సాగింది. ఈ కార్యక్రమంలో ఆర్సీఎం బిషప్ మోస్ట్ రెవరెండ్ ఎండీ ప్రకాశం, మంత్రి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన



నెల్లూరు(బారకాసు) : అంతర్జాతీయ టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నీలో ఇండియా టీమ్‌కు ఎంపికైన నెల్లూరు క్రీడాకారుడు ఆశీర్వాదం ఎమ్మెల్సీ, సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారుడికి ఎమ్మెల్సీ అభినందనలు తెలియజేశారు.

మనుబోలులో అపరిచితుడి హల్‌చల్



మనుబోలు: స్థానిక పడమటి వీధిలో ఓ అపరిచితుడు మంగళవారం హల్‌చల్ చేశాడు. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో పడమటి వీధిలోని కాంద్ర నరసారెడ్డి ఇంటి గోడ దూకుతుండగా, గమనించిన వారు ఫోన్లో సమాచారం చేరవేశారు. దీంతో చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసి అపరిచితుడ్ని వెంబడించారు. బస్టాండ్ సమీపంలోని ఓ ఇంటి డాబాపై దాక్కొని ఉండగా, పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. విచారించిన పోలీసులు బిహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. రైల్లో వెళ్తూ, మతిస్థిమితం సక్రమంగా లేక మనుబోలులో దిగి నాలుగు రోజులుగా చుట్టుపక్కల సంచరిస్తున్నాడని తెలిపారు. అతని కుటుంబసభ్యులతో మాట్లాడి తిరిగి రైల్లో బిహార్ పంపారు. కాగా మనుబోలులో నిఘాను రాత్రి వేళ పోలీసులు పటిష్టం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆనందోత్సాహాలతో క్రిస్మస్



ప్రత్యేక ప్రార్థనల్లో చిన్నారులు



ఆర్సీఎం చర్చిలో క్రిస్మస్ విశిష్టతను వివరిస్తున్న బిషప్ ఎండీ ప్రకాశం



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

- కిటకిటలాడిన క్రీస్తు మందిరాలు
- లోకరక్షకునికి స్వాగతం పలుకుతూ ప్రత్యేక ప్రార్థనలు

నెల్లూరు(బృందావనం) : లోక రక్షకుడు, శాంతిదూత యేసు క్రీస్తు జన్మించిన క్రిస్మస్ పర్వదినాన్ని నగరంలో బుధవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. అన్ని ప్రార్థనా మందిరాల్లో మంగళవారం ఉదయం నుంచి పాటలు, వాక్యోపదేశాలతో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. క్రైస్తవ సంఘీయులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. క్యాండిల్స్ వెలిగించి లోకరక్షకుడిని వేడుకుంటూ ప్రార్థనలు చేశారు.

నగర పరిధిలో..

నగరంలోని ఏబీఎం కాంపౌండ్‌లో ఉన్న ది లోన్ స్టార్ బాప్టిస్టు చర్చిలో కంచర్ల ప్రభుదాస్, సాలి విజయకుమార్ ఆధ్వర్యంలో ఆరాధనలు నిర్వహించారు. సంతపేటలోని జేమ్స్ ఆఫ్ క్రైస్ట్ చర్చిలో రెవరెండ్ జెరోమ్ పాస్టర్ ఆధ్వర్యంలో, రైల్వేఫీడర్స్ రోడ్డులోని లోన్‌స్టార్ బాప్టిస్టు చర్చిలో ఐఎస్.బెన్హర్ బాబు ఆధ్వర్యంలో ఆరాధనలు జరిగాయి. సంతపేట రోమన్ కేథలిక్ కెథడ్రిల్‌లో మోస్ట్ రెవరెండ్ బిషప్ ఎండీ ప్రకాశం ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. వీఆర్సీ వద్ద గల బాప్టిస్టు చర్చి డొనీహాల్‌లో సంఘ కాపరి రెవరెండ్ కంది శ్యాంసన్‌కుమార్ క్రీస్తు బోధనలు వివరిస్తూ సందేశం అందించారు. బట్వాడిపాళెంలోని ది సెంటినరీ బాప్టిస్టు చర్చిలో రెవరెండ్ హరిపాల్ నేతృత్వంలో క్రిస్మస్ ఆరాధనలు నిర్వహించారు. నీలగిరి సంఘంలోని హెబ్రోన్ బిలీవర్స్ అసెంబ్లీస్ చర్చిలో రెవరెండ్ డేవిడ్ దయాసాగర్ ఆధ్వర్యంలో,. దర్గామిట్టలోని ది సాల్వేషన్ ఆర్మీ, పొదలకూరురోడ్డులోని యునైటెడ్ క్రిస్టియన్ బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ ఆరాధనలు నిర్వహించారు. వేదాయపాళెం ది గుడ్‌న్యూస్ బాప్టిస్టు చర్చిలో రెవరెండ్ రాజశేఖర్ దాసరి ఆధ్వర్యంలో, ఫత్తేఖాన్‌పేటలోని సెయింట్ ఆంథోని చర్చి, రామిరెడ్డిపేటలోని ది తెలుగు సెకండ్ బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ ఆరాధనలు కోలాహలంగా జరిగింది.

- నెల్లూరు(సెంట్రల్) : నగరంలోని 13వ డివిజన్‌లో ఉన్న చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ప్రార్థనల్లో ముస్లిం మహిళ



బాప్టిస్ట్ చర్చి డొనీహాల్లో దైవ సందేశమిస్తున్న రెవరెండ్ శ్యాంసన్‌కుమార్.. ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు



పశువుల పాకలో బాల యేసు



ఆర్సీఎం చర్చిలో యేసు శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

వాజ్‌పేయికి ఘన నివాళి



మహిళలకు చీరల పంపిణీ

నెల్లూరురూరల్ : భారత మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి వేడుకలను వెంకటేశ్వరపురంలోని గాంధీ గిరిజన కాలనీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ గిరిజన మోర్చ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్.పెంచలయ్య, మారుబోయిన శ్రీనివాసులు ఆర్థిక సాయంతో తొలుత దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. అనంతరం వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాసులు, గిరిజన మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 33/11 కేవీ శెట్టిగుంటరోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు వెడల్పు చేసిన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను మారుస్తున్నందున గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని విద్యుత్‌శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ కాలనీ, మధురానగర్, ప్రశాంతినగర్, పల్లిపాడురోడ్డు, కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, మైపాడు రోడ్డు, వేణుగోపాల్ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

రేపు ఓసీ ఉద్యోగుల వార్షికోత్సవం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్‌శాఖ ఓసీ(ఓపెన్ క్యాటగిరీ) ఉద్యోగుల సంక్షేమ సంఘ వార్షికోత్సవాన్ని ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు సంఘ రీజనల్ సెక్రటరీ బి.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు మునిశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సీపీఆర్ కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ జరుగుతుందని తెలియజేశారు.

బీసీలు ఐక్యంగా ఉండాలి



బీసీ సమన్వయ కమిటీ సమావేశంలో నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : గ్రామస్థాయిలో బీసీ కులాలు ఐక్యంగా ఉండాలని బీసీ సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ బీసీ సమన్వయ కమిటీ జిల్లా సమావేశం ముత్తుకూరు రోడ్డులోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించారు. ఇందులో జిల్లాలోని 24 బీసీ కులాల ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా బీసీ సమన్వయ కమిటీ కన్వీనర్ బుధవరపు బాలాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా పరిశీలకుడు ధరణికోట లక్ష్మీనారాయణ జిల్లాలో బీసీ కులాల ఐక్యతను బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, కార్యాచరణ ప్రణాళికపై దిశా నిర్దేశం చేశారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల కమిటీలను ప్రతి బీసీ కులం నుంచి ఒక్కో కన్వీనర్‌ను ఎన్నుకొని నియోజకవర్గ కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. ఆయా కమిటీల ద్వారా అన్ని బీసీ కులాలను సంఘటితం చేసుకొని మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కో–కన్వీనర్ భాస్కర్‌గౌడ్, బీసీ నాయకులు వెంకట్రావ్, దుర్గంపాటి పద్మజ, జిల్లా విశ్రాంత న్యాయమూర్తి సంజీవయ్య, ఇరగరాజు శ్రీనివాసరావు, సోమగోపాల్, మన్నెం రాముగౌడ్, నల్లబోతుల వెంకటేశ్వర్లు, అల్లం రమణయ్య ఆచారి, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పరమాచార్యులు ఆరాధన ఉత్సవం నేడు

నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో 'పరమాచార్యులు ఆరాధన ఉత్సవం' గురువారం సాయంత్రం 6 గంటలకు జరుగనుందని నిర్వాహకుడు స్వామి సమయానంద నాథ బుధవారం తెలిపారు. ఆదిశంకర ధ్యానమందిర కమిటీ, చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరాధన ఉత్సవంలో పరమాచార్యుల జీవిత విశేషాలు, శంకరాచార్య విరచిత శివానంద లహరి శ్లోకాలను అగస్త్యరాజు వెంకటసుబ్బారావు విశ్లేషిస్తారన్నారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి పరమాచార్యుల వారి అనుగ్రహానికి పాత్రులు కావాలన్నారు.

ఇండోర్ స్టేడియం సందర్శన

నెల్లూరు(బారకాసు) : నగరంలోని మాగుంట లేఅవుట్‌లో నూతనంగా నిర్మించిన ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియాన్ని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి బుధవారం సందర్శించారు. తొలుత ఆయన్ను స్టేడియం నిర్వాహకుడు దేవళ్ల రాకేష్ సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నేత వైవీరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లను అందజేస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య ఆధ్వర్యంలో నగరంలోని 32వ డివిజన్, వెంగళరావునగర్, పార్కు సమీపంలో బుధవారం క్రిస్మస్ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్యాగం, కరుణ, గొప్పతనానికి యేసు ప్రభువు మారుపేరని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నరసింహులుగౌడ్, స్వర్ణ ప్రసాద్, కార్యానవీన్, దార్ల రమేష్, పాశం శ్రీనివాస్, సీహెచ్ హరిబాబుయాదవ్, యేసు నాయుడు, మురళీకృష్ణంరాజు, బెల్లంకొండ వెంకయ్య, అల్లాభక్షు, ముత్తంగి రామయ్య, బల్లి వెంకయ్య, జాన్‌పీటర్, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తి అసభ్య ప్రవర్తనపై మహిళ ఫిర్యాదు

నెల్లూరు సిటీ : తన చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడని బాధితురాలు చిన్నబజారు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. మహిళ ఫిర్యాదు మేరకు.. నగరంలోని వనంతోపు సెంటర్‌లో ఉంటున్న సుహాసిని వీఆర్ కళాశాలలో ఎల్ఎల్‌బీ చివరి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో కళాశాలలో శ్రీనివాసులు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అయితే అతని ప్రవర్తన సరిగ్గా లేకపోవడంతో వాట్సాప్‌లోని ఓ గ్రూప్ నుంచి తొలగించారు. ఈ క్రమంలో తనను ఎందుకు తొలగించావని ఆమె పట్ల అసభ్యకర మెసేజ్‌లు పంపాడు. ఇతర గ్రూప్‌లలో కూడా ఆమెపై చెడుగా ప్రచారం చేశాడు. అంతేకాకుండా ఈనెల 23న కళాశాల ప్రాంగణంలో సుహాసిని చేయి పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోరుబాటను జయప్రదం చేయండి



పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆనం విజయకుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్, పార్టీ నేతలు

నెల్లూరు(బారకాసు) : విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 27వ తేదీ నగరంలోని విద్యుత్ భవన్ వద్ద చేపట్టే 'పోరుబాట'ను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు స్థానిక చింతారెడ్డిపాళెంలోని ఆనం నివాసంలో పోరుబాటకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పలువురు పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కరెంట్ చార్జీలను తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్నెళ్లలోపే చార్జీలను పెంచడం ప్రజలను మోసగించడమేనని అన్నారు. డిస్కమ్‌ల పేరుతో విద్యుత్ చార్జీలను ఇబ్బడిముబ్బడిగా పెంచుతూ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై కోట్లాది రూపాయల భారాన్ని మోపుతోందని గుర్తుచేశారు. కరెంట్ చార్జీల పెంపుదలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిఒక్కరూ సన్నద్ధులై ధర్నా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ఎన్నికల్లో అలవికాని హామీలను ఇచ్చిన కూటమి నేతలు తీరా అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ హామీలను పట్టించుకోవడం లేదని గుర్తుచేశారు. నిత్యావసరాల ధరలు రోజురోజుకు పెరుగుతూ ప్రజలకు భారంగా మారిన తరుణంలో కరెంట్ చార్జీల పెంపుదల దారుణమన్నారు. గృహ వినియోగదారులపై మోపిన బాదుడును వెంటనే ఉపసంహరించుకోవాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కార్గో కష్టాలు

- ఆర్టీసీ కార్గోలో బుకింగ్‌కు గంటల తరబడి వెయిటింగ్
- మూడు కౌంటర్‌లకు ఒకటి మాత్రమే నిర్వహణ

నెల్లూరు సిటీ : ఇతర ప్రాంతాల్లోని తమ వారికి వస్తువులు లేదా ఇతర సామగ్రిని పంపించేందుకు అనేక పార్శిల్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. పదుల సంఖ్యలో సర్వీసులు ఉన్నా అధిక సంఖ్యలో ప్రజలు ఆర్టీసీ కార్గోని వినియోగిస్తుంటారు. భద్రతగా వస్తువులు తమ వారికి అందుతాయని నమ్మకంతో ప్రజలు ఆర్టీసీ కార్గోలో బుకింగ్ చేసుకుంటారు. అయితే పార్శిల్ బుకింగ్ చేసుకోవాలంటే గంటల తరబడి వెయిటింగ్ చేయాల్సిందే.

రెండు బస్టాండ్‌లకు ఒకటే కేంద్రం

నగరంలో శ్రీపొట్టిశ్రీరాములు ఆర్టీసీ బస్టాండు, ప్రధాన ఆర్టీసీ బస్టాండులు ఉన్నాయి. ఈ రెండింటితో కలిపి ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో కేంద్రం ఉంది. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కేరళ తదితర ప్రాంతాలకు ప్రతిరోజూ 600 నుంచి 800 వరకు పార్శిల్ బుకింగ్‌లు జరుగుతుంటాయి. ఎక్కువగా ఉదయం సమయంలో బుకింగ్‌లు చేసేందుకు ప్రజలు వస్తుంటారు. అయితే ఆర్టీసీ అధికారులు మాత్రం కార్గో బుకింగ్ కౌంటర్‌లు మూడు ఉండాల్సి ఉండగా ఒకటి మాత్రమే నిర్వహణలో ఉంది.

క్యూలో వేచి ఉండాల్సిందే

తమ పార్శిల్ ఇతర ప్రాంతాలకు పంపించేందుకు బుకింగ్ కౌంటర్ వద్దకు వచ్చిన వ్యక్తికి ఇబ్బందులు తప్పట్లేదు. సింగిల్ కౌంటర్ మాత్రమే ఉండడంతో ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోంది. కార్గో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్శిల్ బుకింగ్ సమయంలో చిల్లర కూడా తిరిగి ఇవ్వడం లేదు. ఉదాహరణకు రూ.74 అయితే కస్టమర్ రూ.80 ఇస్తే తిరిగి రూ.6ల చిల్లర ఇవ్వడం లేదని చెబుతున్నారు.



పార్శిల్ కౌంటర్ నుంచి బారులు తీరిన ప్రజలు



పార్శిల్ కౌంటర్ వద్ద..



వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్శిల్స్

చిల్లర కూడా ఇవ్వరు

పార్శిల్ బుకింగ్‌కు చేసిన తరువాత మిగిలన చిల్లర ఇవ్వడం లేదు. నా పార్శిల్ బుకింగ్‌కు రూ.95 అయితే రూ.100 ఇచ్చాను. తిరిగి రూ.5 చిల్లర ఇవ్వలేదు. తామే చిల్లర తెచ్చుకోవాలని, తమ వద్ద లేదని ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు.

– సంతోష్, స్టాన్‌హౌస్‌పేట

నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేయాలి

రోజురోజుకు ఆర్టీసీలో కార్గో పార్శిల్స్ పెరుగుతున్నాయి. అయితే ఆర్టీసీ అధికారులు ప్రస్తుతం సింగిల్ కౌంటర్ మాత్రమే నిర్వహణలో ఉండడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. అధికారులు నాలుగు కౌంటర్‌లు పని చేసేలా చర్యలు తీసుకోవాలి.

– బాలాజీ, దర్గామిట్ట